## క్లుప్తంగా

### కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ



తెనాలిఅర్బన్: పేదలందరికి ఇళ్లు పథకంలో భాగంగా ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత రిజిస్ట్రేషన్లు బుధవారం కొనసాగాయి. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి పట్టణ పరిధిలోని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేశారు. ఈ నెల 23 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు పర్యవేక్షించారు.

### నేడు వలంటీర్లకు వందనం కార్యక్రమం

తెనాలిటౌన్: కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం ఉదయం 11 గంటలకు మండలంలోని గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శిల్పా కానూరి బుధవారం తెలిపారు. మండలంలో ఇద్దరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 335 మందికి సేవా మిత్ర అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని అవార్డులు అందజేస్తారని తెలిపారు.

### నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

తెనాలిఅర్బన్: వీఎస్సార్ కళాశాల సమీపంలో రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన ప్రధాన పైపులైన్ మరమ్మతుల కారణంగా గురువారం సాయంత్రం నుంచి నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు పూర్తయిన అనంతరం సరఫరాను పునరుద్ధరించడం జరుగుతుందని తెలిపారు. అప్పటి వరకు పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకుంటూ సహకరించాలని కోరారు.

### వెంకట్రావు సేవలు మరువలేనివి

తెనాలిఅర్బన్: ఉపాధ్యాయునిగా రావూరి వెంకట్రావు అనేక మంది విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేశారని అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు పేర్కొన్నారు. వెంకట్రావు సంతాప సభను బుధవారం గాంధీనగర్‌లో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వెంకట్రావు అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు కె.బెనహర్‌బాబు, ఈ అంబరీషుడు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, జి.కోటయ్య, ఎం.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### పాడి పరిశ్రమ అభివృద్ధికి పసిదూడల పెంపకం దోహదం

పెదపరిమి(తాడికొండ): పాడి పరిశ్రమ అభివృద్ధికి సమర్థవంతమైన పసిదూడల పెంపకం ఎంతో మేలు అని ఏపీ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సీఈఓ శ్రీనివాసరావు సూచించారు. తుళ్లూరు మండలం పెదపరిమిలో ఏడాది లోపు పసిదూడల ప్రదర్శనను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మంచి ఆరోగ్యవంతమైన పసిదూడలను పెంచడం వలన రైతులకు పాల ఉత్పత్తికి సంబంధించిన లాభాలతో పాటుగా నాణ్యమైన పశుగణాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. రైతులందరూ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో అధిక పాల ఉత్పత్తులను సాధించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పెదపరిమి వెటర్నరీ డాక్టర్ శ్రీ పతి రేణుకాదేవి, డాక్టర్ ఎ.మురళీ కృష్ణ, డాక్టర్ టి.శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్ సుమబాల, డాక్టర్ ఎం.మౌనిక, వైఎస్సార్‌సీపీ నాయకులు నంబూరు రఘునాథరావు, పుట్టి సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో పాల్గొన్న ఉత్తమ జాతి దూడల రైతులకు బహుమతులు అందజేశారు.

### దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం

**దళిత, క్రైస్తవ, ముస్లిం సంఘాల హెచ్చరిక**

మంగళగిరి: క్రైస్తవులు, ముస్లింలు, దళితులపై మతోన్మాద శక్తులు హిందూమతం ముసుగులో దాడులకు పాల్పడుతున్నారని, చర్చిలను ధ్వంసం చేస్తూ భారత రాజ్యాంగంలో ఉన్న మత స్వేచ్ఛను హరించివేయడం బాధాకరమని పలువురు దళిత, క్రైస్తవ, ముస్లింలు పేర్కొన్నారు. క్రైస్తవులు, ముస్లింలు, దళితులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బుధవారం నగరంలోని ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారత దేశం లౌకిక దేశం అనేది మర్చిపోయి మతం మత్తులో మతోన్మాదులు దేశ కీర్తి ప్రతిష్టలను దిగజార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంగళగిరి పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రవిప్రకాష్, తాడేపల్లి మండల అధ్యక్షుడు పాస్టర్ డగ్లస్, దుగ్గిరాల పాస్టర్స్ అధ్యక్షుడు సురేష్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సహదేవ్, పాస్టర్లు సెదక్, స్టీఫెన్, మెస్సేక్, జమాతే ఇస్లామిక్ హింద్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ పాల్గొన్నారు.

# ప్రజలు, ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు

**ఎమ్మెల్యే శివకుమార్**



కొల్లిపరలో అవార్డులు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: ప్రజలు, ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు అని తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పాలకేంద్రం కల్యాణ మండపంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శివకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా వలంటీర్ వ్యవస్థ ప్రవేశ పెట్టిన వెంటనే ప్రతిపక్షాలు విపరీతంగా విమర్శించాయి. ఆనాడు విమర్శలు చేసిన టీడీపీ, జనసేన నాయకులు.. వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలకు ప్రజలు వారికి ఇస్తున్న ప్రేమను భరించలేక రానున్న ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి రావటం కష్టం అని భావించి నేడు వలంటీర్లపై అనేక విమర్శలు చేస్తూ పైశాచిక ఆనందం చెందుతున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే ప్రతి ఒక్కరి కృషి ఉంటేనే సాధ్యపడుతుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు అందాలంటే నాయకులు, మధ్యవర్తులకు డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి, కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 50 కుటుంబాలకు ఒక వలంటీర్ ద్వారా అర్హత ఉన్న పేద ప్రజలకు నేరుగా వారి ఇంటి వద్దకే అందించటం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరలా సీఎంను చేయాలని, అలాగే తెనాలి శాసనసభ్యుడిగా తనని కూడా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం సేవావజ్ర అవార్డుకు ఎంపికైన సఫవత్ జ్యోతి బాయికి రూ.45వేలు, సేవారత్న అవార్డుకు ఎంపికైన వాణి, క్రాంతికుమార్, సౌజన్య, దేవమణి, ఆశాజ్యోతిలకు రూ.30 వేలు చొప్పున, సేవామిత్ర అవార్డుకు ఎంపికైన 324 మందికి రూ.15వేలు చొప్పున అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, వైసీపీ పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు 1, 2 బొల్లిముంత పోతురాజు, అద్దంకి బోసుబాబు, సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీటీసీలు కె.శ్రీలత, ఝాన్సీ, వైసీపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, పార్టీ నాయకులు నెర్ల కుటుంబరెడ్డి, కళ్ళం వీరారెడ్డి, కొల్లి రాఘవరెడ్డి, బేతాల భూషణం, గుదిబండి కృష్ణకిషోర్‌రెడ్డి, ఎంపీడీవో విష్ణుప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు పాల్గొన్నారు.

### సత్కారం నా అదృష్టం..



ప్రభుత్వ ఆశయాలను నెరవేరుస్తాం. వలంటీర్‌గా అవకాశం కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటాను. పేదలకు సంక్షేమ పథకాలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. సేవలను గుర్తించిన ప్రభుత్వం నన్ను ఎమ్మెల్యే శివకుమార్ చేతుల మీదుగా సత్కరించి, ప్రోత్సాహం కింద రూ.45 వేలు అందించటం నా అదృష్టంగా భావిస్తున్నాను.

**సఫవత్ జ్యోతి బాయి, వలంటీర్, వల్లభాపురం**

### జగనన్నకు రుణపడి ఉంటాం..



ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా స్వేచ్ఛగా పనిచేస్తూ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. నిరుద్యోగిగా ఉన్న నాకు వలంటీర్‌గా ఉన్న గ్రామంలోనే ఉపాధి కల్పించి ఆర్థికంగా ఆదుకుంటున్న జగనన్న ప్రభుత్వానికి మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

**తాత ఆశాజ్యోతి, వలంటీర్, తూములూరు**

## ఎన్నికలకు 'సిద్ధం' అంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

**'బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే'లో నాలుగు వార్డుల స్పందన**



వార్డుల నాయకులతో ఎమ్మెల్యే శివకుమార్ బ్రేక్‌ఫాస్ట్

తెనాలి: అసెంబ్లీ ఎన్నికలకు తెనాలి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సిద్ధం చేసే దిశగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించిన 'బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే' సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈనెల 16వ తేదీ నుంచి రోజుకు కొన్ని వార్డుల చొప్పున ఈ కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమావేశాలకు పార్టీ నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, బూత్‌లెవల్ ఏజెంట్లు ఉత్సాహంగా హాజరవుతున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ ఇంజినీరింగ్ కాలేజి ఆవరణలో పట్టణంలోని 14, 16, 33, 34 వార్డుల సమావేశం ఏర్పాటు చేశారు. కౌన్సిలర్లు దాసరి వీరవసంతరావు, మొగల్ అహ్మద్ బేగ్, పేరం సంజీవరెడ్డి, కాళిదాసు సత్యం, కో ఆప్షన్ సభ్యుడు బచ్చనబోయిన శ్రీనివాసరావు, పార్టీ ముఖ్యనేతలు, సచివాలయ కన్వీనర్లు, తదితరులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. అందరితో కలసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. వార్డుల్లో రాజకీయ పరిస్థితులు, పార్టీ బలాబలాలు వంటి అంశాలపై చర్చించారు. ఎన్నికల్లో ముందుకెళ్లేందుకు సమన్వయంతో పనిచేయాల్సిందిగా నిర్ణయించుకున్నారు. నియోజకవర్గంలో గరిష్టంగా పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చిన విషయం తెలిసిందే. దాదాపు రూ.1800 కోట సంక్షేమ లబ్ధిని అందించారు. రికార్డు స్థాయిలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు మెరుగైన జీవనం వంటి అంశాలను ప్రతి ఇంటికీ చేర్చాలని నిర్ణయించారు. ప్రతిపక్షాలు చేస్తున్న అవాస్తవ విమర్శలను తిప్పికొడుతూ, ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని నిర్ణయం తీసుకున్నారు. భారీ మెజారిటీతో విజయం సాధించేవరకు విశ్రమించమని చెప్పారు. పార్టీ నేతలు మన్నవ ప్రభాకర్, నీలా సువర్ణరాజు, ఉన్నవ సాల్మన్, షేక్ బాజి, సయ్యద్ సుభాని, షేక్ సాదిక్, యనమద్రి శ్యామ్, తురకా శాంతకుమారి, అక్కిదాసు రవికృపాల్, శ్రీరాములు, చెట్టు శ్రీనివాసరావు, ఆర్ఎంపీ శ్రీను, ఉడుముల మహేష్‌రెడ్డి, ఉడుముల చినకోటిరెడ్డి పాల్గొన్నారు.

### ఐఎఫ్ ప్యానల్స్‌తో బోధించాలి

యనమదల (ప్రత్తిపాడు): ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)ను వినియోగించి బోధన చేయాలని పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు బి. లింగేశ్వరరెడ్డి అన్నారు. ప్రత్తిపాడు మండలం యనమదలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. తరగతి గదులు, విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లతో పాటు విద్యా సామర్థ్యాల్ని పరిశీలించి, మాట్లాడుతూ విద్యార్థులు బైజూస్ ట్యాబ్ వినియోగ వ్యవధిని పెంచాలని సూచించారు. జిల్లా, మండల పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు స్విఫ్ట్‌చాట్ యాప్‌ను మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు తాము బోధిస్తున్న తరగతులు, సబ్జెక్టుల వివరాలు ఏపీ టీచర్ బాట్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. విద్యాశాఖాధికారులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు టోఫెల్ బోధనలో విద్యార్థులను దత్తత తీసుకోవాలన్నారు.

## వైభవంగా కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు



పార్థసారథి దంపతులను సన్మానిస్తున్న అర్చకులు

తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లో వేంచేసియున్న సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం సీతారాముల కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చి వాహన సేవ కార్యక్రమాలను వైఖానాస పండితులు ఎన్‌జీఎల్ రఘురామ్, వేదాంతం నాగమారుతీ, ఆలయ అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏడు రోజుల పాటు జరిగే స్వామివారి ఉత్సవాల్లో 23న సువర్చల హనుమత్ కల్యాణం, 24న శ్రీవారి రథోత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, నిఖిల్ శాండిల్యా దంపతులు, దాతలు గుడివాడ బాల కృష్ణ దంపతులు, మాజేటి వెంకటేష్ దంపతులు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు అనురాధ, సభ్యులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కిరణ్ కుమార్ పర్యవేక్షించారు.

## మూడో రోజు ఉత్సాహంగా నాటికల పోటీలు



దీపాల సుబ్రమణ్యం, నాగలక్ష్మిలను సత్కరిస్తున్న కళాపరిషత్ నిర్వాహకులు



విముక్తి నాటికలో సన్నివేశం

**ప్రేక్షకులను ఆలోచింపజేసిన విముక్తి నాటిక**

తెనాలిటౌన్: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి తృతీయ ఆహ్వాన నాటికల పోటీలు బుధవారం మూడో రోజు కొనసాగాయి. స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పరిషత్ పోటీలు జరుగుతున్నాయి. పోటీలలో తొలుత కర్నం సురేష్ మెమోరియల్ థియేటర్స్ వారి 'నాలోన నీవే' సాంఘిక నాటికను ప్రదర్శించారు. రచన, దర్శకత్వం బొమ్మిడి రామకృష్ణ వహించారు. అనంతరం పట్టణంలో సేవా రంగ ప్రముఖులు విజయలక్ష్మి శ్రీనివాసా నాట్యమండలి నిర్వాహకులు దీపాల సుబ్రమణ్యం, యేల్చూరి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు నాగలక్ష్మిలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. రెండో ప్రదర్శనగా ఉషోదయ కళానికేతన్ కాట్రపాడు వారి 'విముక్తి' సాంఘిక నాటికను ప్రదర్శించారు. రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు వహించారు. నాటక కళా పరిషత్ నిర్వాహకులు ఆరాధ్యుల కన్నా, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, పిట్టు వెంకట కోటేశ్వరరావు, కళాకారుల సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, తదితరులు పర్యవేక్షించారు.

**తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటాల్సిన అవసరం ఉంది..**

తెలుగు భాష దినోత్సవం సందర్భంగా సభలో తెలుగు భాష ఔన్నత్యంపై సమీక్ష జరిపారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు యర్రంశెట్టి హనుమంతరావు, ప్రముఖ న్యాయవాది సోలా శంకర్, ఆంజనేయనాయుడులు తెలుగు భాష ఔన్నత్యంపై మాట్లాడారు. తెలుగు భాషను నిర్లక్ష్యం చేస్తున్నారని, భాష ఔన్నత్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

## మురుగు కాల్వల మరమ్మతులకు ప్రత్యేక చర్యలు

**మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక**



కాల్వ పూడికతీత పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ అనిల్

తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగు కాల్వల మరమ్మతులకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 28వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయని చెప్పారు. వ్యర్థాల తొలగింపుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆమె వెంట కౌన్సిలర్ యాతాటి అనిల్, ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సురక్షతో ఆరోగ్య భరోసా



తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని 14వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు, మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు పేర్కొన్నారు. చినరావూరు తోటలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు వీటిని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. అందరూ వీటి సేవలను ఉపయోగించుకోవాలన్నారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ జనరల్ ఓపీ 192, గైనాకాలజీ ఓపీ 11, పీడీయాట్రిషియన్ 35, ఆప్తామాలజీ విభాగంలో 65 మందికి సేవలు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దివి కిషోర్ కుమార్, డాక్టర్ ఎం.అనురాధ, డాక్టర్ ఎస్.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌చే రక్తదాన శిబిరం



తెనాలి: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రామలింగేశ్వరపేటలోని ఓపెన్ ఆడిటోరియంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక జిల్లా ఆసుపత్రి రక్తనిధి కేంద్రం సహకారంతో జరిగిన శిబిరంలో 15 మంది యువకులు రక్తదానం చేశారు. గర్భిణులకు ప్రసవ సమయాల్లో, ప్రమాదాలు సంభవించినపుడు రక్తం ఆవశ్యకత ఉంటుందని, తగినన్ని రక్త నిల్వలు లేకపోతే ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉంటాయన్న భావనతో రక్తదానాన్ని ప్రోత్సహిస్తున్నట్టు నాగరాజు చెప్పారు. పాథాలజీ డాక్టర్ హితాని, 76 సార్లు రక్తదానం చేసిన కాలేజి ప్రిన్సిపాల్ నన్నపనేని సునీల్, బోర్డు ప్రిన్సిపాల్ మాల్యాద్రి, ఏవో చిట్టిబాబు, వైద్య సిబ్బంది రమాదేవి, సుజాత, శ్రీను పాల్గొన్నారు.

## ఉపాధి కోర్సుల్లో సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లను అందజేస్తున్న కిరణ్‌కుమార్

తెనాలి: స్థానిక చెంచుపేటలోని యేల్చూరి అమ్మ వృద్ధాశ్రమంలో బుధవారం జరిగిన జాతీయ మాతృభాష దినోత్సవంలో గుంటూరులోని జనశిక్షణ్ సంస్థాన్ బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ చేతులమీదుగా వీటిని అందజేశారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు వైఎస్ లక్ష్మి, సాయి, శేషుకుమార్, సుబ్రహ్మణ్యం, సయ్యద్ గ్యాస్ సుభాని, ఉన్నవ రాజేష్ పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేది భాష



మాట్లాడుతున్న ఆచార్య కృపాచారి



మాతృభాష దినోత్సవంలో విద్యార్థులు



ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

తెనాలిఅర్బన్: జాతి సంస్కృతి, సంప్రదాయాలను భాష పరిరక్షిస్తుందని నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతరత్న పీవీ నరసింహారావు ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలు చేశారని గుర్తు చేశారు. తెలుగు జాతి గర్వపడే విధంగా దేశాన్ని పాలించారన్నారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణ, నాయకులు ప్రకాశరావు, సత్యసాగర్, అప్పారావు, హృదయరాజు, సాంబ్రాజ్యలక్ష్మి, బేతాళ ప్రసాద్ పాల్గొన్నారు.

**గ్రంథాలయంలో ...**

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని శాఖాగ్రంథాలయంలో బుధవారం అంతర్జాతీయ భాషా దినోత్సవం జరిపారు. తెలుగు తల్లి చిత్రపటానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్రాంత తెలుగు అధ్యాపకులు శ్రీరామమూర్తి, గ్రంథాలయాధికారిణి కడియాల సుజాత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలను నిర్వహించారు. పోటీలలో మొదటి బహుమతి ఎస్.స్నేహ, రెండో బహుమతి కె.ధన్యశ్రీ, మూడో బహుమతి బి.సాహితీలు సాధించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. మాతృభాష గొప్పదనాన్ని విద్యార్థులకు విశ్రాంత అధ్యాపకులు శ్రీరామమూర్తి తెలియజేశారు. విద్యార్థులకు బిస్కెట్లు అందజేశారు. గ్రంథాలయాధికారిణి సుజాత పర్యవేక్షించారు.

తెనాలి: పట్టణానికి చెందిన స్వరలయ వేదిక, తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక ఆర్‌ఆర్ నగర్‌లోని గిరిజన బాలికల హాస్టల్/స్కూలు ఆవరణలో మాతృభాష దినోత్సవం జరిపారు. స్వరలయ వేదిక అధ్యక్షుడు డీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు అధ్యక్షత వహించారు. పదోతరగతి పరీక్షకు వెళుతున్న విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్, పెన్నులు అందజేశారు. తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపకులు సాయి లక్కరాజు స్వీట్లు పంచారు. 9వ తరగతిలో 500పైగా మార్కులు సాధించిన విద్యార్థినులకు నగదు బహుమతులను ప్రకటించారు. ప్రిన్సిపాల్ విజయకుమార్, ఉపాధ్యాయిని లక్ష్మి, స్వరలయ, భాషోద్యమ సమితి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ముగిసిన కోనేరు లక్ష్మయ్య స్మారక క్రీడా పోటీలు



కేఎల్‌యూ విద్యార్థులకు మెమెంటో అందజేస్తున్న వీసీ పార్థసారథివర్మ

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కోనేరు లక్ష్మయ్య స్మారక క్రీడలు 2024 బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని తెలిపారు. మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యంతో పాటు క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని చెప్పారు. మొత్తం ఐదు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. కబడ్డీ లో కేఎల్‌యూ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా, ఎన్టీఆర్ జిల్లా పరిటాల అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సాధించారని చెప్పారు. ఖోఖోలో కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని, ఎన్టీఆర్ జిల్లా పరిటాల మిక్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారని తెలిపారు. బాస్కెట్ బాల్‌లో హైదరాబాద్ వీఎన్ఆర్ బీజేపీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, వడ్డేశ్వరం కేఎల్‌యూ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారని చెప్పారు. హైదరాబాద్ నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు త్రోబాల్ మహిళల విభాగంలో ప్రథమ స్థానాన్ని , కేఎల్‌యూ విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకొన్నారని తెలిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్లు ఎ.వి.ఎస్. ప్రసాద్, ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సీహెచ్. హనుమంతరావు, డీన్ సలహాదారులు హబీబుల్లా ఖాన్, క్రీడల అసోసియేట్ డీన్ కె. హరికిశోర్, ఆర్. శుభాకర్ రాజు, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చేబ్రోలు: స్థానిక లక్ష్మీ గోదావరి స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన గురుశెట్టి, సోమనాథ్‌లు గంజాయి తాగటానికి అలవాటు పడటంతో పాటు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. కొత్తరెడ్డిపాలెంలో బాలకృష్ణ అనే వ్యక్తి దగ్గరకు గంజాయిని విక్రయించేందుకు వెళ్తున్న గురుశెట్టిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి కిలో గంజాయిని, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. గురుశెట్టిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు పొన్నూరు రూరల్ సీఐ వై కోటేశ్వరరావు తెలిపారు. దాడుల్లో చేబ్రోలు ఎస్ఐ పి. మహేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.